# హ్యాపీ న్యూ ఇయర్

నూతన సంవత్సరం తొలి రోజును పురస్కరించుకొని నగర ఎమ్మెల్యేలు, బీఆర్ ఎస్ శ్రేణులు బుధవారం ఉదయం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్)కుశుభాకాంక్షలు తెలిపారు.


మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి


బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ యాదవ్


ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్


పల్లె రవికుమార్


బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్


రజనీ సాయిచంద్


దేవీ ప్రసాద్


రావుల శ్రీధర్ రెడ్డి


క్యాలెండర్ ఆవిష్కరణలో బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, కిశోర్ తదితరులు


ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, తదితరులు


ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ముఠాగోపాల్


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్


మాజీ డిప్యూటీ సీఎం మహమ్మద్ అలీ


కల్పతరు పర్వదినం కార్యక్రమానికి హాజరైన గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ

## రామకృష్ణ మఠంలో ఘనంగా కల్పతరు

చిక్కడపల్లి, జనవరి 1 : దోమలగూడలోని రామకృష్ణ మఠంలో కల్పతరు పర్వదినం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్పతరు పర్వదినం సందర్భంగా విశేష పూజలు, భజనలు, హోమం, ఆలయ ప్రదక్షిణం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద.. కల్పతరు పర్వదినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

## వాక్ ఇన్ ఇంటర్వ్యూ

సుల్తాన్‌బజార్, జనవరి 1: ఇందిరాప్రియ దర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యూజీ, పీజీ కోర్సులకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిషు విభాగంలో బోధించేందుకు 1 పోస్టుకు అతిథి అధ్యాపకుడిని భర్తీ చేసేందుకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత(ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం ఉత్తీర్ణత)ఉన్న అభ్యర్థులు, సంబంధిత సబ్జెక్టుల్లో నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 3న ఉదయం 11 గంటల్లోగా నాంపల్లిలోని ఇందిరాప్రియ దర్శిని ప్రభుత్వ మహి డిగ్రీ కళాశాలలో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు.

## రేపటి నుంచి అండర్ -19 బ్యాడ్మింటన్ పోటీలు

నేరేడ్‌మెట్: ఆలిండియా జూనియర్ అండర్–19 ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు 3 నుంచి 10 వరకు జరగనున్నట్లు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి కరెడ్ల శ్రీనివాస్ రావు, ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ బ్యాట్ యూవీ ఎన్. బాబు పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఇండియా చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ పర్యవేక్షణలో రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్ర, అంతర్రాష్ట్రాలకు చెందిన సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని వారు తెలిపారు.

# కొత్త ఏడాదిలో భూముల వంతు

### హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో భూముల వేలానికి సన్నాహాలు

### రెండు దఫాలుగా భూముల విక్రయంతో ఆదాయం సమకూర్చుకునే ప్రణాళికలు

సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ) : కొత్త ఏడాదిలో భూములను వేలం వేసేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. నగరం చుట్టూరా ఉన్న భూములకు వేలం నిర్వహించి... నిధులు సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఇక కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు అవసరమైన నిధులను కూడా భూముల వేలం ద్వారా సేకరించే ప్రణాళికలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ ఆదేశాలతో భూముల వేలం కోసం హెచ్ఎండీఏ దృష్టి సారించింది. ఈ ఏడాదిలో నగరంలో కీలకమైన హెచ్ఎండీఏ లే అవుట్లలో ప్లాట్లను విక్రయించనున్నట్లుగా సమాచారం. కోకాపేట్ భూముల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించాలని భావిస్తోంది. కోకాపేట్ లే అవుట్‌లో మిగిలిన 24 ఎకరాలతోపాటు బుద్వేల్, మేడిపల్లి, మోకీలా ప్రాంతాల్లో హెచ్ఎండీఏ డెవలప్ చేసింది. ఈ క్రమంలో ఆ ప్లాట్లను మార్కెట్లోకి తీసుకు రావాలని ప్రభుత్వం యోచిస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెట్ తిరోగమనంలో ఉందనే వాదనలను బలహీనపరిచేలా కోకాపేట్ భూముల వేలంపై హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వానికి ఆదాయాన్ని తీసుకువచ్చే నియోపొలిస్ వెంచర్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. ఓవైపు నగరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ అభివృద్ధి చెందుతుందని, అనూహ్యంగా నిర్మాణ అనుమతులను ఇస్తున్నామని చెప్పుకోవడం వెనుక.. చతికిల పడిన మార్కెట్‌ను ప్రభావితం చేయడంలోనే భాగమనే వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో నగరంలో పలు చోట్ల ఉన్న హెచ్ఎండీఏ డెవలప్ చేసిన వెంచర్లలో భూముల వేలానికి ప్రభుత్వం సన్నాహాలు జరుగుతున్నాయి.

### భూములపై గంపెడాశలు..

నిజానికి రాష్ట్రంలో భూముల వేలం కొత్తేమి కాదు. గత ప్రభుత్వం కూడా భూముల ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా వేలం నిర్వహించి.. నిధులను సమకూర్చుకుంది. కానీ వేలానికి ముందు రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన నిర్ణయాలు, అందుకు అవసరమైన మౌలిక వసతులు, పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుతో ఆయా భూములకు విపరీతమైన డిమాండ్‌ను తీసుకువచ్చింది. అదేవిధంగా కొనుగోలుదారులకు అనువైన వాతావరణం కల్పించింది. కానీ గడిచిన ఏడాది కాలంగా నగరంలో స్థిరాస్తులను కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గతంలో హైదరాబాద్ శివారులో ఏర్పడిన వెంచర్లలో ఓపెన్ ప్లాట్లలను కొనేందుకు ఆసక్తి చూపే జనాలు కూడా కాంగ్రెస్ పాలనలో ఏర్పడిన ఇబ్బందులతో భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో విలువైన భూములకు వేలంతో అమ్మకాలు అసాధ్యమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ తేరుకునేంత వరకు భూముల వేలం చేయడం లేదా.. రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడేందుకు ప్రభుత్వమే చొరవ తీసుకుంటే తప్పా... గాడి తప్పిన మార్కెట్ స్థిరత్వం సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా భూములను వేలంలో విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావిస్తోంది.


కొత్త ఏడాది తొలి రోజు జనవరి 1, బుధవారం నాడు కిక్కిరిసిపోయిన జూపార్కు


నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

## శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

కొండాపూర్, జనవరి 1 : ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా నృత్య దర్శకులు కళారత్న కేవీ సత్యనారాయణ శిష్య బృందం, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని సిన్సినాటి నగరానికి చెందిన శ్రీల హ్యాంధవి, చదలవాడ శ్రీద వరాలి, లోహిత చలసాని, అక్షర, వర్ష శృతి, శివాత్మిక, జ్యోతిలు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం సంధ్య రాజు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు.


ఫన్‌చామృతం సంపుటిని ఆవిష్కరించిన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ తదితరులు

## ఫన్ చామృతం సంపుటి ఆవిష్కరణ

ముషీరాబాద్, జనవరి 1: తెలుగు పదాలను విడదీసి అధిక్షేపం, చమత్కారం వంటి వక్రోక్తులను సృష్టించగల నేర్పరి శంకరనారాయణ అని పద్మశ్రీ, అచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ప్రముఖ హాస్య అవధాని శంకర నారాయణ రచించిన ఫన్ చామృతం సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్ని ఫన్ చామృతం సంపుటిని ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచ సాహిత్యంలో అభివ్యక్తీకరణ ఎనిమిది రకాలుగా వుంటాయి, వక్రోక్తి వొకటి కాగా శంకర నారాయణ పదాలతో ప్రయోగాలు చేస్తూ వక్రోక్తి ప్రయోగించడంలో దిట్ట అని కొనియాడారు. త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాటల రచయిత రామారావు విశ్వేశ్వరరావు, రచయిత శంకరనారాయణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.


బీసీ మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## 'బీసీల మహాసభను జయప్రదం చేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 1: కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించనున్న బీసీల మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. విజయ్‌రావు పిలుపునిచ్చారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఇందిరాపార్క్ ఎదుట సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌రావు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించినట్లైతే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ మహాసభ ద్వారా బీసీలంతా జాగృతమై కాంగ్రెస్ పార్టీపై యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. సభకు రాష్ట్రవ్యాప్తంగా బీసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు డాక్టర్ కందుల మధు, రవికిరణ్, సతీశ్‌రెడ్డి, గుమ్మడి క్రాంతి, సాయికుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

బీసీ మహాసభ విజయవంతం చేయాలని వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి నాయకుడు బొడ్డుపల్లి లింగం, ఓయూజేఏసీ వ్యవస్థాపకులు మన అశోక్ యాదవ్ మాట్లాడుతూ సభను జయప్రదం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దండెం ఆనంద్, మిర్యాల రవీందర్, శ్రావణ్‌యాదవ్, అరుణ్, క్రాంతినాయక్, నరేశ్, శివ, గోపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


మహాసభ విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాగృతి, ఓయూజేఏసీ నేతలు

## ఖండకావ్య రచన పోటీలకు ఆహ్వానం

### అవధాన విద్యా వికాస పరిషత్

సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ) : అవధాన విద్యా వికాస పరిషత్తు ఆధ్వర్యంలో ఖండకావ్య రచన పోటీ 2025 నిర్వహిస్తున్నామని అవధాన విద్యా వికాస పరిషత్ మరుమాముల దత్తాత్రేయ శర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పద్య సాహిత్యంలో ఆధునిక రూపాన్ని సంతరించుకొన్న పద్యఖండికల పోటీకి అవధాన విద్యా వికాస పరిషత్ సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. 'మానవ సంబంధాలు' అనే అంశంపై 35 నుంచి 50 పద్యాలలోపు ఒకే ఖండికగా కానీ వేర్వేరు ఖండికలుగా కానీ పద్యాలు రాయాలని సూచించారు. 40 ఏండ్ల లోపు యువతీ యువకులకు ఈ పోటీల్లో అర్హులని తెలిపారు. స్వీయ రచన హామీ పత్రంతో ఫిబ్రవరి 15 లోపున పంపించాలని కోరారు. ప్రథమ బహుమతిగా రూ.5,116, ద్వితీయ బహుమతిగా 3,116, తృతీయ బహుమతిగా 2,116, ప్రోత్సాహక బహుమతులు రూ.1,116 అందిస్తామని వివరించారు. మే నెలలో జరిగే నాలుగో అవధాన శిక్షణ శిబిరంలో విజేతలకు సత్కారం చేస్తామని పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని నేరేడుమెట్ వెస్ట్ కాకతీయ నగర్‌లోని శ్రీరామ సదనంకు పంపించాలని కోరారు. మరింత సమాచారం కోసం 9441039146 నెంబర్‌ను సంప్రదించొచ్చని పేర్కొన్నారు.